# అక్షరదోష గణనం

తన కవితాసంకలనం అచ్చేయించుకుని ఆవిష్కరింపజేసుకున్న ఆనందం క్షణంలో ఆవిరయిపోయింది కరకరరావుకి. కొత్తవాళ్ళకి డి.టి.పికి ఇవ్వడం, టైములేక ప్రూఫ్ చూసుకోకపోవడంతో పుస్తకం నిండా అసంఖ్యాకమైన అచ్చుతప్పులు. వెయ్యి పుస్తకాలు అచ్చయిపోయాయి. హతోస్మి. పుస్తకాలు చదవడం.. అదీ కొని చదవడం.. అనే అభిరుచి బొత్తిగా లేని పాఠకలోకానికి వీటినెలా అమ్మడం? ఏదో రాయాలన్న తన దురద వదిల్చిన చేతిచమురులో పుస్తకాల అమ్మకం ద్వారా కొంతయినా వెనకేసుకుందామంటే.. ఈ అశనిపాతం. ఏం చేయాలో పాలుపోక ఆలోచించాడు.. చించాడు.. చాడు.. చివరాఖరికి ఒక ఐడియా అతడి మెదడులో వెయ్యివాట్ల బల్బులా వెలిగింది.



మరుసటి రోజు అన్ని పేపర్లలో ఒక ప్రకటన ఇచ్చాడు- త ˊ న కవితా సంకలనంలో కావాలనే అనేకానేక అక్షరదోషాలుండేలా చూశానని, పాఠకులు తమ తెలివితో, తెలుగు పరిజ్ఞానంతో తప్పులు వెతికి తనకి తెలియజేయాలని, ఎవరెక్కువ తప్పులు చూపిస్తే వారికి మంచి బహుమతి ఉంటుందని వాళ్ళకి సభ ఏర్పాటు చేసి 'ఉత్తమ అక్షరదోష పరిశోధకుడు' అనే బిరుదునిస్తానని.

అంతే, ఆ మరుసటి రోజు నుంచి పుస్తకాలన్నీ హాట్ కేకుల్లా అమ్ముడయ్యి పునర్ముద్రణ వేయవలసి వచ్చింది, అచ్చుతప్పులతో..!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సైనిక్‌పురి, సికింద్రాబాదు